నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
10 | నిజామాబాద్ బుధవారం 2 ఏప్రిల్ 2025 | ADILABAD NIRMAL

బోథ్‌లో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

సన్న బియ్యం పంపిణీ

బోథ్, ఏప్రిల్ 1 : బోథ్ మండల కేంద్రంలోని చౌక ధరల దుకాణం నంబర్ 5లో మంగళవారం సన్న బియ్యం పంపిణీని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. బయోమెట్రిక్ విధానం ద్వారా పంపిణీని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గంగారెడ్డి, డీటీ రామారా పాల్గొన్నారు.

నేరడిగొండలో..

నేరడిగొండ, ఏప్రిల్ 1 : మండల కేంద్రంలోని పౌర సరఫరాల దుకాణంలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటరమణ, నాయకులు సాబ్లె సంతోష్, గులాబ్ సింగ్, ప్రతాప్‌సింగ్, తహసీల్దార్ కలీం,ఆర్ఐ నాగోరావ్ పాల్గొన్నారు.

నార్నూర్‌లో కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం

పంపిణీలో వాగ్వాదం

నార్నూర్, ఏప్రిల్ 1 : మండల కేంద్రంలోని చౌక దరల దుకాణంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. తహసీల్దార్ జాడి రాజాలింగం సన్నబియ్యం పంపిణీ చేసే క్రమంలో తమను ఎందుకు ఆహ్వానించలేదని తహసీల్దార్, డీలర్‌ను బీజేపీ మండలాధ్యక్షుడు రాథోడ్ బిక్కు, మాజీ అధ్యక్షుడు ప్రకాశ్‌లు నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కిలో సన్నబియ్యం అందిస్తే.. బీజేపీ ప్రభుత్వం ఐదు కిలోల బియ్యం అందిస్తుందని నిలదీశారు. కాంగ్రెస్ నాయకులను ఆహ్వానిస్తే.. బీజేపీ నాయకులను ఎందుకు ఆహ్వానించలేదని ప్రశ్నించారు. దీంతో రెచ్చిపోయిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. మాట మాట పెరిగి రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు అక్కడి నుంచి వెళ్లి పోయారు.

పంపిణీ సరే.. మంత్రి ఉత్తమ్ ఫొటో ఏదీ?

ఆదిలాబాద్ పట్టణంలో మంగళవారం చౌకధరల దుకాణంలో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. సంతోషమే గానీ .. ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఒక వైపు సీఎం రేవంత్‌రెడ్డి, మరో వైపు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫొటోలు పెట్టారు. పాపం పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డి ఫొటో లేకపోవడం గమనార్హం. స్వయానా కాంగ్రెస్ నాయకులే మెల్లిగా మాట్లాడుకోవడం వినిపించింది. - ఫొటోగ్రాఫర్, నమస్తే తెలంగాణ

సన్నబియ్యం పంపిణీ ఫ్లెక్సీలో కనిపించని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఫొటో

డీలర్ల మెడపై కత్తి

- సన్న బియ్యం విక్రయిస్తూ ఎవరైనా దొరికినా కేసులు తప్పవు
- అధికారుల నిర్ణయాలతో హడలెత్తిపోతున్న రేషన్ డీలర్లు
- బ్యాక్‌లాగ్ బియ్యం తీసుకెళ్లాలంటూ విజ్ఞప్తి



రేషన్ దుకాణాలు 1,712

రేషన్ కార్డులు	ఉమ్మడి జిల్లాలో రేషన్ లబ్ధిదారులు	లబ్ధిదారులు
7.59 లక్షలు		24.12 లక్షలు
కొత్తగా మంజూరైన రేషన్ కార్డులు 72,276		కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులు 1.55 లక్షలు

మంచిర్యాల, ఏప్రిల్ 1(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉగాది సందర్భంగా రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేసింది. ఇప్పటి వరకు చేపట్టిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాల్లో లోటుపాట్లున్న నేపథ్యంలో సన్న బియ్యం పంపిణీనైనా విజయవంతం చేయాలనే ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయి. ఈ మేరకు ఇప్పటికే రేషన్ షాపులకు స్టాక్ సరఫరా చేశామని చెప్తున్నారు. కొత్తగా రేషన్‌కార్డులు మంజూరై పౌర సరఫరా శాఖ పోర్టల్‌లో పేర్లున్న వారికి సన్నబియ్యం ఇస్తామని చెప్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా రేషన్ డీలర్ల విషయంలో సర్కారు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు దారి తీస్తున్నది. గతనెల వరకు రేషన్ షాపులకు పంపిణీ చేసిన దొడ్డు బియ్యంలో కొంత బ్యాగ్‌లాగ్ స్టాక్ మిగిలింది. ఈ నెల నుంచి సన్న బియ్యం ఇవ్వనుండడంతో ప్రతి షాప్‌కు ఫుల్ అలైన్‌మెంట్ ఇచ్చారు. బ్యాక్‌లాగ్ ఉన్న దొడ్డు బియ్యాన్ని తీసుకెళ్లలేదు. ఈ బియ్యానికి మీదే బాధ్యత అంటూ డీలర్లపైనే ఆ భారం పెట్టేశారు. వారం, పది రోజుల క్రితం ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి వచ్చిన అధికారులు ప్రతి రేషన్ షాపు తిరిగి ఎంత స్టాక్ మిగిలిందనే లెక్కలను నమోదు చేసుకున్నారు. ఆ బస్తాల పక్కన డీలర్లను నిలుచోబెట్టి ఫొటోలు తీసుకున్నారు. బియ్యం స్టాక్ దించినప్పుడు ఈ బియ్యాన్ని తిరిగి తీసుకెళ్తామని చెప్పి నప్పటికీ ఇప్పటి దాకా ఆ బియ్యాన్ని అధికారులు తీసుకెళ్లలేదని రేషన్ డీలర్లు చెప్తున్నారు. బ్యాక్‌లాగ్ దొడ్డు బియ్యానికి మమ్ములను బాధ్యులు చేయడం ఏంటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలా వరకు షాపులను అద్దెకు తీసుకుని నడిపిస్తున్నామని, పాత స్టాక్‌కు సెక్యూరిటీ ఇచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. గతంలో కంది పప్పును డీలర్ల వద్దే ఉంచి అవి పూర్తిగా పాడయ్యాక చలాన్లు కట్టమన్నారని, ఈ బియ్యం మంచిగ ఉన్నప్పుడు చలాన్లు కట్టామంటే కడుతాం కానీ పాడయ్యాక కట్టిస్తే ఇబ్బంది అవుతుందంటున్నారు. డీలర్ల వద్దే వదిలేసిన బ్యాక్‌లాగ్ బియ్యం స్టాక్‌లను వెంటనే తీసుకెళ్లాలని లేదా చలాన్లు కట్టించుకుని మాకు వదిలేసినా తీసివేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్తున్నారు. ఈ విషయంలో వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని డీలర్లు కోరుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా కొన్ని వందల క్వింటాళ్ల బ్యాక్‌లాగ్ బియ్యం రేషన్ షాపుల్లోనే ఉండిపోయినట్లు తెలుస్తున్నది.

విక్రయిస్తే డీలర్లపై కేసులు

ఇప్పటి దాకా రేషన్ షాపుల్లో దొడ్డు బియ్యాన్ని తినేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. ఆ బియ్యాన్ని కిలోకు రూ.10 నుంచి రూ.15 చొప్పున బయట అమ్ముతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇలా దొడ్డు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసే కొందరు ప్రైవేటు వ్యాపారులు.. ఆ బియ్యాన్ని కిలోకు రూ.18 నుంచి రూ.25 చొప్పున మహారాష్ట్రకు తీసుకెళ్లి విక్రయించిన సొమ్ము చేసుకునేవారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఈ దందాకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పెట్టింది పేరు. పక్కనే మహారాష్ట్ర బార్డర్‌లో డెన్‌లు ఏర్పాటు చేసుకుని రేషన్ బియ్యాన్ని తరలించుకుని పోయేవారు. అధికారులు ఎవరు తింటున్నారు సార్. అమ్మేస్తున్నారు.. ఏం చేయమంటారు అంటూ చెప్పుకొచ్చేవారు. ఇప్పుడు సన్న బియ్యం ఇస్తున్న నేపథ్యంలో ఆ బియ్యం పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సి ఉన్నది. ఈ విషయాన్ని అధికారులు ఇటీవల జిల్లా కేంద్రాల్లో రేషన్ డీలర్ల మండలాధ్యక్షులు, కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో చెప్పారు. రేషన్‌షాపు చుట్టుపక్కల ఎవరైనా సన్నబియ్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు విక్రయిస్తే అది డీలర్ ప్రోద్బలంతో జరిగినట్లుగానే భావిస్తామని, మీ మీదే కేసులు పెడతామని అధికారులు హెచ్చరించినట్లు తెలిసింది. ఈ తీరుపై డీలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సన్నబియ్యం పంపిణీ చేయడం వరకే తమ బాధ్యత అవుతుందని, లబ్ధిదారులు దాన్ని బయటికి విక్రయిస్తే మమ్ములను బాధ్యులను చేయడం ఏంటని మండిపడుతున్నారు. రేషన్ బియ్యంతో వ్యాపారం చేసే వ్యక్తులను వదిలేసి మమ్ములను బాధ్యులను చేయడం ఏంటని నిలదీస్తున్నారు.

సర్కార్ ఫ్లెక్సీలో పార్టీ పైత్యం.. ప్రారంభించింది పార్టీ లీడర్లే..

సన్న రేషన్ బియ్యం పంపిణీ నేపథ్యంలో అన్ని రేషన్ షాపుల సమీపంలో సర్కారు ఆధ్వర్యంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీలపై తెలంగాణ ప్రభుత్వ లోగో ముద్రించారు. కానీ మంచిర్యాల నియోజకవర్గవ్యాప్తంగా రేషన్‌షాపుల్లో ఏర్పాటు చేసిన గవర్నమెంట్ ఫ్లెక్సీల్లో ఎంపీ వంశీకృష్ణ ఫొటో కనిపించలేదు. పోనీ స్థానిక ఎమ్మెల్యే ఫొటోతో పాటు సీఎం, మంత్రుల ఫొటోలు ఉండి ఎంపీ ఫొటో పొరపాటున మిస్ అయ్యింది అనుకునేలానూ అది లేదు. ఫ్లెక్సీలో కలెక్టర్ ఫొటో పక్కనే మంచిర్యాల డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఫొటో ముద్రించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లోగోతో రూపొందించిన ఫ్లెక్సీలో ఎంపీ ఫొటో లేకుండా డీసీసీ అధ్యక్షురాలి ఫొటో ఉండడంపై పలువురు కాంగ్రెస్ నాయకులే అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తలు, ఇతర నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో పార్టీ లీడర్ల పేర్లు ఉన్నాయంటే ఏమో అనుకోవచ్చు. కానీ ప్రభుత్వ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఫొటోలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఇకపోతే కాంగ్రెస్ పార్టీ నాయకులు పలుచోట్ల రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభించారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ తోపాటు మాజీ కౌన్సిలర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్లు బియ్యం పంపిణీని ప్రారంభించారు. ఇలా ప్రభుత్వ కార్యక్రమంలో అధికార పార్టీ లీడర్లు ఇష్టారాజ్యం చేస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది.

లక్షెట్టిపేట గోదావరి రోడ్డులో షాప్ నంబర్ 13లో సర్కార్ లోగోతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో డీసీసీ అధ్యక్షురాలి ఫొటో, ఇందులో ఎంపీ ఫొటో లేకపోవడం గమనార్హం

నీటి కోసం అవస్థలు..

నీళ్ల కోసం అవస్థలు పడుతున్న కాలనీవాసులు

తాంసి మండల కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో మంచి నీటి సమస్య తీవ్రంగా ఉంది. మిషన్ భగీరథ ద్వారా అందుతున్న నీరు వారానికి కేవలం మూడు రోజులు మాత్రమే వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భగీరథ నల్లా నీరు ఒక రోజు వస్తే మరుసటి రోజు రావడం లేదని అంటున్నారు. రోజు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, ట్యాంకర్ల సహాయంతో నీటి సరఫరా కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. - తాంసి, ఏప్రిల్ 1

పోక్సో కేసులో ఉపాధ్యాయుడి అరెస్టు

నర్సాపూర్ (జీ), ఏప్రిల్ 1 : నర్సాపూర్ (జీ) మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఆంగ్ల ఉపాధ్యాయుడిని ఏఎస్పీ రాజేశ్ మీనా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పాఠశాలలో విద్యార్థినులపై గణిత ఉపాధ్యాయుడు మనోహర్ రెడ్డి, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు మోహన్‌రావులు అసభ్యంగా ప్రవర్తించడంతో గత జనవరిలో పోక్సో కేసు నమోదైంది. అప్పటి నుంచి ఇద్దరు పరారీలో ఉన్నారు. మొదటగా మనోహర్‌రెడ్డిని రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. మంగళవారం ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు మోహన్ రావుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు.

ఉపాధి హామీ కూలి మృతి

ఉట్నూర్ రూరల్, ఏప్రిల్ 1 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని ఆందోలి గ్రామానికి చెందిన ఉపాధి కూలి పౌరేకర్(34) మంగళవారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పౌరేకర్ కిరాణంతోపాటు తన భార్య సొనాలితో కలిసి మూడు వారాల నుంచి ఉపాధి పనులకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో రోజు మాదిరిగానే మంగళవారం కూడా ఉపాధి పనులకు వెళ్లి వచ్చాడు. భోజనం చేసి పడుకున్న కొద్ది సేపటికి వాంతులు, విరోచనాలతోపాటు చాతిలో నొప్పి వస్తుందన్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఇంద్రవెల్లి దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగై వైద్యం కోసం అంబులెన్స్‌లో తరలిస్తుండగానే మృతి చెందాడు.

యూనివర్సిటీ భూముల జోలికొస్తే ఊరుకోం

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

ఎదులాపురం, ఏప్రిల్ 1 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల జోలికొస్తే ఊరుకునేది లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్ అన్నారు. మంగళవారం కలెక్టర్ ఆఫీస్ సమీపంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ.. హెచ్‌సీయూ 400 ఎకరాల భూములను వేలం వేసి ఇతర ప్రైవేట్ కార్పొరేటు కంపెనీలకు అప్పచెప్పే ప్రయత్నం కాంగ్రెస్ సర్కారు చేస్తుందన్నారు. విద్యార్థులు మా భూములు మాకు కావాలనీ ధర్నాలు చేస్తుంటే రేవంత్ రెడ్డి లాఠీచార్జి చేయిస్తూ వారిని అరెస్టు చేయిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన మానుకుని విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని, ఆ భూముల జోలికి వెళ్లకుండా ఉండాలన్నారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని యూనివర్సిటీలలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సక్కు సాయి, యమున, రమ్య, దివ్య, అఖిల్, కల్యాణ్, రామ్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బెట్టింగ్‌లతో జీవితాలను నాశనం చేసుకోవద్దు

ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

ఎదులాపురం, ఏప్రిల్ 1 : యువత బెట్టింగ్‌లకు పాల్పడుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఆదిలాబాద్ ఆన్‌లైన్ క్రికెట్ బెట్ ఆన్‌లైన్ యాప్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఎస్పీ అఖిల్ మహాజన్ వన్ టౌన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బెట్టింగ్ యాప్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్, నిషేధిత ప్లే కార్డ్స్, గేమింగ్ యాప్‌లకు, ఐపీఎల్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. డైట్ మైదానంలో కొందరు యువకులు ఆన్‌లైన్‌లో ఐపీఎల్ బెట్టింగ్ ఆడుతున్న సమాచారం రావడంతో సోమవారం రాత్రి పెట్రోలింగ్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. కచ్‌కంటి గ్రామానికి చెందిన జోగు సాయికుమార్, పట్టణానికి చెందిన షేక్ సాజీద్ ఆన్‌లైన్‌లో ఐపీఎల్ మ్యాచ్ బెట్టింగ్ నిర్వహిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరి ఫోన్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ క్రికెట్ 99 యాప్‌లో బెట్టింగ్ చేస్తున్నట్లు గుర్తించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు బి.సునీల్‌కుమార్, కరుణాకర్, ఎస్సై అశోక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

నిజాయితీతో విధులు నిర్వర్తించాలి..

నిజాయితీతో విధులు నిర్వర్తించి ప్రజలకు మంచి సేవలను అందించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బ్లూ కోర్ట్, డయల్ 100 సిబ్బంది, జిల్లా పోలీసు అధికారులతో మంగళవారం ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొని సిబ్బందిని ఉద్దేశించి పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా డయల్ 100 సిబ్బందిని మూడు కేటగిరీలుగా విభజించి విధులను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. రాత్రి 10.30 గంటల తర్వాత అనవసరంగా గుంపులు గుంపులుగా తిరిగే వారిపై ప్రత్యేకంగా తనిఖీ నిర్వహించి వేలిముద్రలను సేకరించాలని సూచించారు. డయల్ 100కు ఫోన్ చేసే వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని చెప్పారు. ఈ సమావేశంలో డీఎస్పీలు శ్రీనివాస్, నాగేందర్, సీఐలు భీమేశ్, గుణవంత రావ్, పాండే రావ్ పాల్గొన్నారు.